క్లుప్తంగా

కానిస్టేబుల్ మృతికి సంతాపం


సతీష్ (ఫైల్)

రణస్థలం: జే.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ నడికట్ల సతీష్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జే.ఆర్.పురం పోలీసులు తెలిపారు. ఈయన స్వస్థలం పార్వతీపురం మన్యం జిల్లాలోని విరఘట్టం మండల కేంద్రం. గత కొన్నేళ్లుగా విజయనగరం జిల్లా కేంద్రంలో స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు. ఉద్యోగ రీత్యా మండల కేంద్రంలోని జే.ఆర్.పురంలో అద్దెకు ఉంటున్నారు. సతీష్‌కు భార్య చంద్రకళ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సతీష్ మృతి పట్ల జే.ఆర్.పురం సీఐ జి.రామచందరరావు, ఎస్ఐ కె.గోవిందరావు, సిబ్బంది సంతాపం తెలిపారు.

వితరణ..


చెక్కు అందజేస్తున్న జనసేన నాయకులు

జి.సిగడాం: మండలంలోని నిద్దాం గ్రామంలో రచ్చ బండ నిర్మాణానికి ఎచ్చెర్ల నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జి విష్వక్సేన్ రూ.30 వేల చెక్కును పార్టీ మండల నాయకుడు మీసాల రవికుమార్ చేతుల మీదుగా మంగళవారం గ్రామస్తులకు అందించారు. రచ్చ బండ నిర్మాణానికి ముందుకు వచ్చిన విష్వక్సేన్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కాకర్ల బాలాజీ, శ్రీరాములు, గ్రామస్తులు ఉన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే శంకర్


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శంకర్

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు శంకర్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని మంగళవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. నియోజకవర్గ పరిధి అంశాలపై కాసేపు చర్చించారు.

ఆదాయపు పన్నుపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: ఆదాయపు పన్ను చెల్లింపుపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్ కె.రవిశంకర్ అన్నారు. ఎచ్చెర్ల శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్, చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజీల్లో ఆదాయపు పన్ను చెల్లించే విధానంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆదాయపు పన్ను చెల్లించేవారు అర్హత మేరకు తిరిగి మళ్లీ పన్నులో మినహాయింపు పొందవచ్చునని అన్నారు. పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం వద్దన్నారు. ప్రిన్సిపాళ్లు ఎస్.సి.వి.రమణమూర్తి నాయుడు, యండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీవాల పెంపకందారులకు శిక్షణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం సాధించేందుకు నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ఎంతో ఉపయోకరమని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు జయరాజ్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుల వారి కార్యాలయంలో మంగళవారం గొర్రెలు, పెంపకందారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలు పెంపకంతోనే అధిక ధనాన్ని సంపాదించవచ్చన్నారు. కార్యక్రమంలో సమగ్ర గొర్రెలు అభివృద్ధి పథకం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ యోగేశ్వరరావు, ఏడీ, డీడీలు పి.మాణిక్యాలరావు, డాక్టర్ జి.నారాయణరావు, పి.మనోజ్‌కుమార్, కె.రాజగోపాల్, శ్రీనివాస్, ఉష పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం


నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రత్యేక హోదా విభజన హామీలు ప్రస్తావన లేకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు సభ్యులు బి.కృష్ణమూర్తిలు అన్నారు. శ్రీకాకుళం అంబేడ్కర్ కూడలిలో కేంద్ర బడ్జెట్‌కి వ్యతిరేకంగా మంగళవారం నిరసన చేపట్టారు.ఈ సందర్భంగాగా బడ్జెట్ పత్రాలను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ బడ్జెట్ కార్పొరేట్ ప్రయోజనాలు కాపాడే బడ్జెట్ అని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.సింహాచలం, కె.నాగమణి, పి.ప్రసాదరావు, పి.తేజేశ్వరరావు, జి.ఈశ్వరమ్మ, ఎ.లక్ష్మి, కె.మోహనరావు, కొత్తకోట అప్పారావు, పి.చంద్రరావు, ఎన్.వి.రమణ, కె.సూరయ్య, ఎం.గోవర్ధనరావు, ఆర్.ప్రకాశరావు పాల్గొన్నారు.

• ఎరువుల పంపిణీ



జి.సిగడాం మండలం పెంట గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద మంగళవారం సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ సింహాద్రి ఆధ్వర్యంలో రాయితీపై ఎరువులు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, గ్రామానికి చెందిన నాయకులు, రైతులు పాల్గొన్నారు. – జి.సిగడాం

• ముమ్మరంగా ఉభాలు

జి.సిగడాం మండలంలో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు పున్నాం, పెంట, నాగులవలస, బాతువ, సీతంపేట, మద్రివలస, నక్కపేట, టీడీవలస, సంతవురిటి, దవళపేట, గేదెలపేట, బూటుపేట, ఎల్లయ్యపేట గ్రామాల్లో రైతులు దమ్ములు చేపట్టి ఉభాలు వేస్తున్నారు. – జి.సిగడాం



• ఫ్రెండ్ రిక్వెస్టులకు స్పందించొద్దు



అపరిచిత వ్యక్తులు ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పంపే ఫ్రెండ్ రిక్వెస్టులకు స్పందించవద్దని ఏహెచ్‌టీయూ ఎస్ఐ రేవతి విద్యార్థులకు సూచించారు. మంగళవారం వరల్డ్ డే అగైనెస్ట్ ట్రాఫికింగ్ ఇన్ పర్సన్స్ సందర్భంగా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఏడురోడ్ల కూడలి సమీపంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తెలియని వ్యక్తులతో స్నేహం చేయరాదని, వారి మాయమాటలు నమ్మరాదని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఏడురోడ్ల కూడలి నుంచి ర్యాలీని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. – శ్రీకాకుళం క్రైమ్

సీటు.. యమ హాటు..



ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల


మహిళా డిగ్రీ కళాశాల


విద్యార్థులు

- ఆ రెండు కళాశాలల్లో ప్రవేశాలకు డిమాండ్
- ప్రభుత్వ పురుషుల, మహిళా డిగ్రీ కళాశాలల వైపే అందరి చూపు

విద్యార్థుల భవితకు బాట



శ్రీకాకుళంలో ఎంతో కీర్తి, విశిష్టతను కలిగిన పురుషుల, మహిళా డిగ్రీ కళాశాలలు ఉండటం విద్యార్థులకు వరమనే చెప్పాలి. అనేక కోర్సులు, మెరుగైన సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. నిష్ణాతులైన అధ్యాపకులను కలిగి ఉన్న ఈ కళాశాలల్లో విద్యార్థులు తమ బంగారు భవితకు బాటలు వేసుకోవాలి.

– డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు,
ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళలు,
ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పురుషుల డిగ్రీ కళాశాల

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ప్రఖ్యాత కళాశాలలుగా కీర్తి గడించిన ఆ రెండింటిపైనే అందరి చూపు పడింది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి వారం రోజుల్లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికానుంది. దీంతో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషులు, మహిళా డిగ్రీ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఈ రెండు కళాశాలల్లో పలు కోర్సులు, ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. అలాగే గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నాడు–నేడు పథకంతో ఈ కళాశాలల్లో మెరుగైన సౌకర్యలను కల్పించారు. దీంతో వీటిల్లో చేరేందుకు విద్యార్థులు ఉవ్విళ్లూగుతున్నారు. మెజారిటీ విద్యార్థు ఈ విద్యా సంవత్సరంలో తమ మొదటి ఆప్షన్‌ను ఈ రెండు కళాశాలలకే ఇచ్చారంటే అతిశయోక్తి కాదు. 2024–25 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ఇప్పటికే ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకున్నారు. రివైజ్‌డ్ నోటిఫికేషన్‌తో మారిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. సీట్ అలాట్‌మెంట్‌ను ఆగస్టు మూడో తేదీన ప్రకటించనున్నారు. ఐదో తేదీ నుంచి తరగతులు మొదలుకానున్నాయి.

జిల్లాకే తలమానిక కళాశాలగా గుర్తింపు

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల. 1953లో ఏర్పాటై ఎంతో విశిష్టత, గుర్తింపును సొంతం చేసుకుంది. ఎన్నో కోర్సులు, మరెన్నో రిసోర్స్‌లు కలిగిన దీనికి ఆర్ట్స్ కళాశాలగా పేరొందింది. శ్రీకాకుళంలో అటు ఆర్ట్స్, ఇటు సైన్స్ కోర్సులు కలిగి మినీ యూనవర్సిటీగా దీన్ని చెప్పుకుంటారు. పలు దూరవిద్య కోర్సులను అందిస్తుంది. పలు పీజీ కోర్సులను కూడా అందిస్తోంది. బీఏ విభాగంలో ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, స్పెషల్ తెలుగు, స్పెషల్ ఇంగ్లిష్, బీకాం విభాగంలో జనరల్ బీకాం, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం ఫైనాన్స్ కోర్సులు ఉన్నాయి. బీఎస్సీ విభాగంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, జువాలజీ, బోటనీ, బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. బీకామ్ జనరల్, బీఎస్సీ కంప్యూటర్స్, కెమిస్ట్రీలో 60, మిగిలిన సబ్జెక్టుల్లో 40 సీట్లు చొప్పున అందుబాటులో ఉన్నాయి.

అటానమస్ కళాశాలగా..

జిల్లాకే తలమానికంగా గుర్తింపు పొందిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 1968లో స్థాపితమైంది. 1979లో నాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి కళాశాలను ప్రారంభించారు. బీఏ, బీకాం, బీఎస్సీ జనరల్ గ్రూపులతో మొదలైన కళాశాల పరంపర అంచెలంచెలగా దూరవిద్యతోపాటు పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్సులకు చేరింది. కళాశాలకు పరిసరాల్లో ఐదు ప్రభుత్వ వసతి గృహాలు కలిగిన ఈ మహిళా కళాశాలలో అడ్మిషన్ పొందాలంటే అంత ఈజీ కాదనేది బహిరంగ రహస్యమే. మూడు సార్లు నాక్ గుర్తింపు పొందింది. ప్రస్తుతం 'ఏ'–గ్రేడ్ (3.09 పాయింట్లతో) గర్తింపు ఉంది. 2019లో స్వయంప్రతిపత్తి కలిగిన కళాశాలగా చరిత్రకెక్కింది. ప్రస్తుతం కళాశాలలో 16 డిగ్రీ కోర్సులు, అనేక పీజీ కోర్సులు ఉన్నాయి.

2024 –25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఏ–లో ఎకనామిక్స్, హిస్టరీ, స్పెషల్ ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ తెలుగు, బీకాం జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్‌సీలో బోటనీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మ్యాథ్స్, ఫిజిక్స్, జువాలజీ, బీబీఏ (హెల్త్ కేర్ మేనేజ్మెంట్) మొదలైన సింగిల్ మేజర్ కోర్సులకు అడ్మిషన్లను నిర్వహించనున్నారు. ఈ కళాశాలకు కూడా భారీగానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

'అణు' సమస్యలు పరిష్కరించాలి

- ప్రహరీ నిర్మాణానికి సమ్మతించిన బాధితులు


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్, అణు విద్యుత్ అధికారులు, బాధితులు

రణస్థలం: కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం నిర్మాణంలో భాగంగా బాధితులకు చెల్లించాల్సిన పెండింగ్ పరిహారం 60 రోజుల్లో చెల్లిస్తామని, ప్రహరీ నిర్మాణానికి సహకరించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, కొవ్వాడ అణువిద్యుత్ చీఫ్ ఇంజినీర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని బంటుపల్లిలో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కొవ్వాడ అణు బాధితులతో ఎమ్మెల్యే సమక్షంలో అణు విద్యుత్ అధికారులు సమావేశమయ్యారు. ఇటీవల అణు బాధితులు తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలుపుతూ ప్రహరీ నిర్మాణ పనులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కొవ్వాడ అణు బాధితులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న 16 మందికి యూత్ ప్యాకేజీ అందజేయాలని, 21 మంది రైతులకు భూ పరిహారం చెల్లించాలని కోరారు. గ్రామకంఠం పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలకు పరిహారం ఇప్పించాలన్నారు. చెట్లు, వ్యవసాయ బోర్లుకు పరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. ఎచ్చెర్లలోని ధర్మవరంలో పునరావాస కాలనీ నిర్మించిన నాటికి ఎంతమంది కొత్తగా 18 ఏళ్లు దాటినవారు ఉంటే అంతమందికి యూత్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, అణువిద్యుత్ అధికారులు మాట్లాడుతూ.. ప్రహరీ 2.5 కిలో మీటర్ల మేర నిర్మాణానికి సహకరించాలన్నారు. మీ సమస్యలతోపాటు కలెక్టర్ పరిధిలో ఉన్న పెండింగ్ పనులు 60 రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు. మిగతా పరిష్కారం కానీ పనులు సీఎం, కేంద్ర మంత్రుల దృష్టిలో పెడతామని వివరించారు. పునరావాస కాలనీ నిర్మాణానికి సుమారు రూ.1500 కోట్లు అవసరం కాగా.. ఇంకా నిదులు విడుదల కాలేదన్నారు. ఈ సమస్య ప్రధాని మోడీ దగ్గర ఉందన్నారు. పునరావాస కాలనీ నిర్మాణానికి అలస్యమైన కొద్దీ 20 శాతం నిర్మాణ విలువ పెరుగుతుందన్నారు. ప్రస్తుతానికి కొవ్వాడ అణు బాధితులంతా కలిసి ప్రహరీ నిర్మాణానికి సహకరిస్తామని తెలిపారు.

దేశ ప్రయోజనాలకు పన్నులు అవసరం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రజాప్రయోజనాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేసేందుకు ఆర్థిక వనరులు అవసరమని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. సాధారణంగా ఆర్థిక వనరులు ఆదాయపు పన్ను ద్వారా ప్రాథమికంగా లభ్యమౌతాయని పేర్కొన్నారు. వాణిజ్యశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఇంకామ్ టాక్స్ ఔట్రీచ్ ప్రోగ్రాం' అనే అంశంపై కళాశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. దేశానికి ఆర్థిక వనరులను సేకరించే ప్రాథమిక మార్గాలలో ఆదాయపన్ను ఒకటన్నారు. అయితే ఆదాయపు పన్నులను సకాలంలో చెల్లించకపోతే జరిగే ప్రభావాలను గురించి చెప్పారు. జిల్లా ఆదాయ పన్ను అధికారి రవికుమార్ మాట్లాడుతు మనం ఆదాయ పన్ను ఎందుకు కట్టాలి? సరిగ్గా పన్ను కట్టకపోతే వచ్చే పరిణామాలేమిటి? అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఇంకామ్ టాక్స్ ఎగవతకు ప్రయత్నించకుండా సక్రమంగా చెల్లించి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. కళాశాల కామర్స్ హెచ్‌వోడీ లబ్బ కృష్ణారావు మాట్లాడుతూ.. ఇంకామ్ టాక్స్ కట్టడం వల్ల దేశానికి ఏ రకమైన ప్రయోజనం కలుగుతుందో వివరించారు. ఆదాయ పన్ను ఇన్‌స్పెక్టర్ పి.రవితేజ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కామర్స్ విభాగం అధ్యాపకులు కె.లలితాబాయ్, బి.సంతోషి పట్నాయక్ ఉన్నారు.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం అర్బన్: తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర రవాణా, క్రీడా, యువజనశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మంగళవారం మంగళగిరిలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు దాసరి కిరణ్, ట్రెజరర్ నవీన్‌కుమార్ ఉన్నారు.

కేన్సర్ బాధితుడికి సాయం


లక్ష్మణ్‌రావుకు సాయం అందజేస్తున్న అగ్నిమాపక ఉద్యోగి ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పీఎన్‌కాలనీలో నివాసముంటున్న జె.లక్ష్మణ్‌రావు లివర్ కేన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకునే పలువురు అతనికి ఆర్థిక, నిత్యావసర సరుకులు అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. సెక్యూరిటీ గార్డుగా పని చేసే లక్ష్మణ్‌రావు కేన్సర్‌తో మంచం పట్టడంతో కుటుంబం ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటుంది. భార్య దివ్యాంగురాలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ఫౌండర్ నంది ఉమాశంకర్ ద్వారా కోటబొమ్మాళిలో అగ్నిమాపక కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న రావాడ ఉమామహేశ్వరరావు బాధితుడు లక్ష్మణ్‌రావు కుటుంబానికి నెలకి సరిపడా నిత్యావసర సరుకులను మంగళవారం అందచేశారు. పిల్లల చదువుకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మదర్ లవ్ ఫౌండేషన్ ప్రతినిధులు సుప్రజ, ఉర్లం శివతేజ, అల్లాడ నవీన్ ఉన్నారు. అలాగే లక్ష్మణ్‌రావు కుటుంబానికి రాజా, వెంకీ మిత్ర బృందం కూడా అండగా నిలిచింది. వాట్సాప్‌గ్రూపు ద్వారా రూ.83 వేలు సేకరించారు. ఈ మొత్తంతోపాటు నిత్యావసర సరుకులు బాధితుడకి అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ అనిల్, మిత్రబృందం నరేష్, సాయి, వెంకటేష్, వాసు, పవన్ ఉన్నారు.

తేజోమూర్తులను పట్టించుకోరా?


కొమ్మల మాటున కలియుగ భీముడు కోడి రామ్మూర్తి విగ్రహం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కీర్తిప్రతిష్టలు పెంపొందించిన తేజోమూర్తులను పట్టించుకునే నాథుడు కరువయ్యారు. నగరంలోని కొత్త బ్రిడ్జి నుంచి సింహద్వారం వరకు పలువురు తేజోమూర్తుల విగ్రహాలను ఇంటాక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అయితే వీటి చుట్టూ మొక్కలు పెరిగి కనీసం విగ్రహం కనపడకుండా పోయాయి. ఇక్కడ గరిమెళ్ల సత్యనారాయణ, చట్టి పూర్ణయ్య పంతులు, వడ్డాది పాపయ్య, పాలూరి శంకరనారాయణ, గౌతు లచ్చన్న, మణికొండ చలపతిరావు, గిడుగు రామ్మూర్తి పంతులు, పొట్నూరు స్వామిబాబు, కోడి రామ్మూర్తి, బంకుపల్లి మల్లయ్యశాస్త్రి విగ్రహాలను దారి పొడవునా ఏర్పాటు చేశారు. అయితే వాటి సంరక్షణ బాధ్యతను అధికారులు పట్టించుకోవడం లేదని జిల్లాకు చెందిన ప్రముఖ శిల్పి దివిలి అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని విగ్రహాలకు రంగులు కూడా వెలసి పోయాయని, కొమ్మలు పెరగడం వలన పక్షుల రెట్టలు విగ్రహాలపై ఉన్నాయని, వాటిని పరిశుభ్రం చేయించాలని కోరారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు


నక్కవీధిలో ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాలలో సుబ్రహ్మణ్య స్వామి ఆడీకృత్తిక మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణలు జరిగాయి. గుడివీధిలోని నాగావళి నదీ తీరంలో గంగా, యమునా, సరస్వతీ మాతృకా మందిరంలోని సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో కావడి ఉత్సవం నిర్వహించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎంఈఓలకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూటీఎఫ్ నాయకులు

రణస్థలం: జీఓ నంబర్ 117ను రద్దు చేయడంతోపాటు విద్యారంగ సమస్యలను పరిష్కారించాలని ఏపీయూటీఎఫ్ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఎంఈఓలు త్రినాథరావు, లావణ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఫ్రీ ప్రైమరీతోపాటు 1 నుంచి 5వ తరగతి వరకు ఒకే పాఠశాల ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయించాలన్నారు. హైస్కూల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, కిలో మీటరు పైబడి దూరం నుంచి వచ్చే సిబ్బందికి రవాణ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి కోదండరామయ్య, జిల్లా సహాధ్యక్షురాలు ధనలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణరావు, జిల్లా కోశాధికారి రవికుమార్, గౌరవ అధ్యక్షుడు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు బస్సులు ప్రారంభం


సూపర్‌లగ్జరీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్, ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణం భద్రతకు భరోసాగా ఉంటుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆర్టీసీ బస్సులను ప్రయాణికులు ఆదరించాలని కోరారు. శ్రీకాకుళం ఒకటవ డిపోకు సంబంధించిన సూపర్‌లగ్జరీ బస్సును, శ్రీకాకుళం రెండవ డిపోకు సంబంధించి రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులను మంగళవారం కాంప్లెక్స్ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణాశాఖమంత్రి ఆదేశాల మేరకు ఈ బస్సులను ప్రారంభించినట్టు వెల్లడించారు. ఒకటవ డిపో మేనేజర్ పి.మల్లికార్జునరాజు, రెండవ డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.శర్మ, అసిస్టెంట్ మేనేజర్‌లు వి.రమేష్, ఎ.గంగరాజు, డీఈ బమ్మిడి రవికుమార్, ఎస్ఎం ఎంపీ రావు, టీఐ–3 ఎల్ఎస్ నాయుడు, హెడ్‌క్లర్క్ బి.దక్షిణామూర్తి, ఏఎంఎఫ్ స్వామి, రాజు, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ బాషా, యూనియన్ నాయకులు ఎంఎస్ రావు, కేజీ రావు, కె.సుమన్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.